
# రాగబంధం

## రోషన్

మొదటి తేదీ వస్తూనే ఒక పట్టుచీరో, జరీచీరో పట్టుకువస్తాడు భర్త. ఇంట్లో కావలసినవన్నీ ఉన్నాయి. సుఖంగా జరిగిపోవడానికి కావలసిన సౌకర్యాలన్నీ ఉన్నాయి. పెళ్ళి అయిననాటినుంచి, ఆ మాటకు పుట్టినప్పటినుంచికూడా ఆమె ఏనాడూ జీవితంలో అతృప్తి ఎరగదు. అయితేనేమి? ఆమె నిరుపేదలకన్న నిర్భాగ్యురాలు. ప్రేమకోసం మొహం వాచిపోయి ఉంది.



చిత్రం - డబ్ల్యు. జె. నవీన్ కుమార్

ఆఫీసులో మానేజర్ సీటులో కూర్చుని ఉన్న రాజా, ఫోన్ కాల్ వచ్చేసరికి మొహం చిట్లించుకున్నాడు.

'ఈ ఫోన్ కాల్స్‌కి లిమిట్ అంటూ ఉండదు. పని ఉన్నా లేకపోయినా ఏమిటో కొంప అంటుకుపోయేటట్లు ఫోన్ చెయ్యడమే.'

చెయ్యి జాపి విసుగ్గా ఫోన్ అందుకున్నాడు.

ఎదురుగా కూర్చున్న లేడీ టైపిస్టు బాస్ చిరాకును గమనించి చిలిపిగా చిరునవ్వు నందించింది.

ఒళ్లు మండినా, సభ్యతకు ఓ చిరునవ్వు పారేసి, "హలో!" అన్నాడు దర్జాగా, తన మామూలు ధోరణిలో.

"మీ వైఫ్‌కు ఏక్సిడెంటు జరిగింది. ఇక్కడ హాస్పిటల్‌లో జాయిన్ చేశారు. త్వరగా రావాలి" అని అవతలి వైపు నుండి వినిపించింది.

కంగారుపడ్డాడు రాజా.

"ఏక్సిడెంటా?"

"అవును! ప్లీజ్, క్విక్!"

వార్డు నంబరు, రూమ్ నంబరు అడిగాడు.

చెప్పారు వాళ్లు.

"క్షణంలో వస్తున్నాను. ఆవిడ జాగ్రత్త!" ఎదురుగా ఉన్న టైపిస్టుకు చెప్పకుండానే బయటికి వచ్చి పడ్డాడు.

క్షణంలో కారులోకి చేరి, స్టార్ట్ చేశాడు.

'వసంతకు ఏక్సిడెంటు అయిందా? ఊహుఁ అంత జాగ్రత్తగా, మెల్లిగా రోడ్డు నియమాల్ని పాటిస్తూ నడిచే వసంతకు ఏక్సిడెంటు ఎలా అవుతుంది? ... కావాలనుకునే ...' ఉలిక్కిపడ్డాడు రాజా.

'అవును! కావాలనుకునే ఈ అఘాయిత్యానికి ఒడిగట్టి ఉంటుంది. దీనికంతటికీ నీ ప్రవర్తనే కారణం.' మనసు ఎదురు తిరిగింది.

ప్రొద్దుట జరిగిన సంఘటన కళ్లముందు మెదిలింది.

• • •

తెల్లవారిపోయింది.

వసంత వంటింట్లో ఉంది.

రాజా పడక గదిలో పరుపుమీదే ఉన్నాడు ఇంకా. అప్పటికి రాజును మూడుసార్లు లేపడానికి వెళ్లి మరీ తిరిగి వచ్చింది.

రాత్రి పడుకునే ముందు, "రేపు పెందరాళే లేపాలి. అయిదున్నర కంతా లేస్తా"ను అన్న భర్త మాటలు చెవుల్లో వినిపిస్తుంటూ ఉంటే తెల్లారకముందే లేచి, వేడినీళ్ళు కాగబెట్టి, టిఫిన్ చేసి రెడీగా పెట్టి, ఆరున్నర అవుతూనే పడక గదిలోకి వెళ్లింది.

రెండు, మూడు సార్లు పిలిచింది.

పలకలేదు.

తట్టి లేపింది.

చెయ్యి విసురుగా నెట్టేశాడు రాజా, "కొద్దిసే పయ్యాక లేస్తాలే!" అంటూ.

ఇవతలికి వచ్చేసింది వసంత.

పది నిమిషాలు ... పదిహేను ... ఇరవై నిమిషాలు ... అర్ధగంట అయిపోయింది. ఏడవుతూంది — రాజా లేవలేదు.

'మరీ నిద్ర పట్టేసిందేమో ఈయనకు.' కంగారుగా లోపలికి లేపింది వసంత.

"అప్పుడే నీకేం తొందర? ఆఫీసుకు వెళ్లేవాణ్ణి నేను. ఏమైనా జరిగితే నాకుగాని నీకు కాదుగా? తరవాత నేనే లేస్తాను. నువ్వెళ్లు." దిండులో తల దూర్చుకున్నాడు రాజా.

భర్త మనస్తత్వం బాగా తెలిసిన వసంత, ఏడవుతుంటే మరీ పడక గదిలోకి వచ్చింది.

'లేపితే విసుక్కుంటారు. లేపకపోతే "నీకేం? మహారాణివి. అక్కడ ఆఫీసులో లేటవుతే, 'మేనేజరుగారే లేటుగా వస్తున్నారోయ్!'అనే మాటలతో ఎంత సిగ్గుగా ఉంటుందో నీకేం తెలుసు?" అంటారు.

తనమీద విసుక్కున్నా ఫర్వాలేదు. మరీ రాజీ కుదరడం ఎంత సేపు? ... కానీ, ఆయన్ను ఆఫీసులో చులకనగా చూస్తే ... ఆయన అవమానం తనది కాదూ?'

అందుకోసం మరీ వెళ్లింది.

"ఏడవు దయిపోతూ ఉంది. ఇక లేస్తారా?" దుప్పటి తొలగించబోయింది.

అంతే! చెంప ఛెళ్లుమంది.

ఏం జరిగిందో గ్రహించబోయేలోగానే రాజా మంచం మీద లేడు.

అదే మొదటిసారి కాకపోయినా, చెంపమీద దెబ్బ పడ్డప్పుడల్లా కొత్తగా బాధపడుతూనే ఉంటుంది వసంత.

భర్త కొట్టాడని ఏడుస్తూ ఏనాడూ కూర్చోలేదు. దెబ్బ క్షణకాలపు బాధను తెలియజేసే శరీరం మీద పడ్డా, అది సూటిగా శరీరాన్ని చీల్చుకొని తగలవలసిన స్థానానికే తగులుతుంది.

కన్నీళ్లు కార్చడానికి నీళ్లు నింపుకున్న కళ్లు కావు కదా — కంటికి కనుపించకుండా లోపల ఎక్కడో ఉన్న హృదయం అది. చాలా విశాలమైంది. ఇలాంటి బాధల్ని ఎన్నో దాచుకోగల సామర్థ్యం ఉంటుంది దానికి.

చిన్నగా నిట్టూర్చి లోపలికి వెళ్లిపోయింది వసంత.

టై కట్టుకుంటూ ఉంటే మెల్లిగా అడిగింది:

"మధ్యాహ్నానికే కూరగాయలు ఉన్నాయి. సాయంత్రం కాస్త త్వరగా వస్తే షాపింగుకు కూడా అలా వెళ్లి, వస్తూ వస్తూ కూరగాయలు కూడా తీసుకురావచ్చు."

ఓ క్షణం వసంత వైపు చూసి, హేళనగా నవ్వాడు రాజా.

"కూరగాయలక్కూడా కట్టుకున్న మొగుడు వెంట రావాలేమో! లేకపోతే వాణ్ణి వెంటబెట్టుకొని బజార్ల వెంబడి తిరిగితే అదో ఫాషనా?"

మరి మాట్లాడలేదు వసంత.

తల దించుకొని మిన్నక ఉండిపోయింది.

గుమ్మం దాటుతూ విసురుగా చెప్పాడు రాజు:

"అంతగా కావలసివస్తే నువ్వు వెళ్లి తెచ్చుకో. అంతేగాని నేను రాను."

వెళ్లిపోతున్న భర్తనే చూస్తూ నిట్టూర్పు విడిచింది వసంత.

పెళ్లయిన నాటి నుండి ఈ వేడి నిట్టూర్పులు తప్ప మరింకేం లేవు తన జీవితానికి.

అలాగని తన విషయాల్లో అశ్రద్ధగా ఏనాడూ ప్రవర్తించలేదు రాజా.

మొదటి తేదీ వస్తూనే ఓ పట్టుచీరో, జరీ చీరో పట్టుకు వస్తాడు. ఇంట్లో కావలసినవన్నీ ఉన్నాయి. మనిషికి సుఖంగా, అత్యంత సుఖంగా జరిగిపోవడానికి కావలసిన సౌకర్యాలన్నీ ఉన్నాయి తనకు. పెళ్లయిన నాటి నుండే కాదు, తను పుట్టినప్పటినుండీ దేనికీ కొరత లేకుండా ఆ విధంగానే పెరిగింది. ఆ జీవితంలో అసంతృప్తిని ఏనాడూ అనుభవించి ఎరగదు. ఇప్పుడూ అన్నీ ఉన్నాయి. కాని, స్త్రీకి ముఖ్యంగా కావలసిన ప్రేమాదరణలే లేవు.

బీదవాళ్లు అన్నానికి మొహం వాచి అల్లల్లాడుతుంటే, తను ప్రేమకోసం మొహం వాచిపోయింది.

ఆ రోజు పక్క ఇంటి సావిత్రమ్మగారి అత్తగారు ఇంటికి వస్తే, తను పెద్దావిడ కదా అనే ఉద్దేశ్యంతో, "బామ్మగారండీ!" అంటే, ఆవిడ ఎంత పొంగిపోయింది!

అంతేకాక తనను ఆప్యాయంగా దగ్గరికి తీసుకొని, ఏవేవో అడిగింది.



ఆపైన వాళ్ళేం మాట్లాడుకున్నారో వినే ఓపిక లేకపోయింది వసంతకు.

వంటింట్లో నిలుచున్నా, అటువైపు గదిలో ఉన్నవాళ్ళు స్పష్టంగానే కనుపిస్తారు. మరి చూడలేకపోయింది వసంత.

ఆ క్షణంలో పూర్తిగా అర్థమైపోయింది వసంతకు. 'అసలు కథ

ఊస

మాట!' అనుకుంది.

ఃకనుముక్కు తీరు బావున్న గాయత్రిని విడిచి పెట్టేశారన్న మాట నా కోసం. హుఁ నాకోసం కాదు. పదిమంది ముందు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం కోసం ... ఆ ఒక్క మాట పాటించక పోయినా బావుండేది! తన పిరికితనంతో అమాయకులైన ఇద్దరు స్త్రీల జీవితాలతో ఆడుకుంటున్నారు. పోనీ, తెగించి పెళ్ళి చేసుకున్న వారు ఇటు తననూ సుఖపెట్టడం లేదు. అసలు ఈ మగాళ్ళంతా...'

అవ్యవస్థంగా ఏవేవో ఆలోచించుకుంటున్న వసంత ఎదురుగా మసిగుడ్డ స్టౌ కంటుకొని పెద్ద మంట లేచేసరికి ఉలిక్కిపడింది.

మసిగుడ్డేనని తెలుసుకుని స్థిమిత పడింది.

తన ఉలికిపాటు గుర్తుకు తెచ్చుకొని నవ్వుకుంది వసంత.

'ఇంకా ఎన్ని నాళ్ళు జీవించినా ఈ అసంతృప్తి బ్రతుకు తప్ప మరో కొత్తదనం ఉండదు జీవితానికి. అల్లాంటిది ముగిసిపోయినంత మాత్రాన బాధపడటం ఎందుకు?' ఎన్నడూ లేనిది మనసులో రేగిన అగ్ని జ్వాలకు కలవర పడిపోయింది.

ఈ విధమైన జ్వాలలు రేగకుండానే ఉండాలి కాని, తీరా రేగాయంటే అంటుకొని జీవితాల్నే నాశనం చేస్తాయి.

ఆలోచనల్ని పక్కకు నెట్టి గబగబా కాఫీ కలిపి, టిఫిన్ ప్లేటులో సర్ది తీసుకెళ్ళింది వసంత.

గాయత్రి ఎవరో ఏమిటో పూర్తిగా తెలిసిపోయినా కూడా అసహ్యం వెయ్యలేదు వసంతకు.

గాయత్రి కూడా తనలాంటి స్త్రీయే.

నలుగురి ముందు అతనితో బంధం పెంచుకొని మోసపోయింది తను.



సృష్టి వైచిత్రి

ఫోటో—పి. పార్వతి (దుర్గాపూర్ - 5)

ఒంటరిగా మరెవ్వరికీ తెలియకుండా మోసపోయింది గాయత్రి. అంతే!

గాయత్రి వెళ్ళిపోతూ ఉంటే ఉట్టి చేతులతో పంపడానికి మనస్కరించ లేదు.

గబగబా గదిలోకి వెళ్ళి, గద్వాల జరీ జాకెట్టు గుడ్డ తీసుకొని వచ్చి చేతిలో పెట్టి, కుంకుమ పెట్టింది.

వసంత చర్యకు గాయత్రితోపాటు రాజా కూడా ఆశ్చర్యపోయాడు.

గాయత్రి వెళ్ళిపోయింది.

భారంగా నిట్టూర్చింది వసంత.

ఆ రోజు రాత్రి రాజా వసంతతో ముభావంగా ఉండిపోయాడు. భోజనం కూడా చెయ్యలేదు.

భర్త భోజనం కూడా చెయ్యకుండా ముడుచుకు పడుకుంటే ఏ భార్యమాత్రం కంచం ముందు కూర్చోగలదు?

గ్లాసెడు నీళ్ళు తాగి, తానూ వెళ్ళి పడుకుంది, గాయత్రి రూపాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటూ.

సగం నిద్రలో ఉంటే నిమురుగా కుదిపి చెప్పాడు రాజా — "త్వరగా లేవు" అని.

"ఊఁ" అని పక్కకు తిరిగి పడుకుంది వసంత.

• • •

హాస్పిటల్ గేటులోకి రయ్యిమని దూసుకుపోయింది రాజా కారు. దిగిందే తడవుగా పరుగు లాంటి నడక సాగించాడు రాజా వార్డు వైపు.

అప్పుడే ఓ కొత్త విషయం తెలిసినట్లయింది రాజాకు. ఇన్నాళ్ళుగా వసంత అంటే ఓ ప్రత్యేకమైన అభిమానం లేదు. భార్య అంటే భార్యే. అంతే! అంతదానికి ఈనాడు తానెందుకు ఇంత ఆత్రత పడుతున్నాడు? ఆవిడ లేకపోతే తాను జీవించలేడా? ... అంటే వసంతను ... వసంతను తనకు తెలియకుండానే ప్రేమిస్తున్నాడా?. . .

రూమ్‌లోకి అడుగు పెట్టిన రాజాకు వసంతను చూడగానే మతిపోయింది.

తలమీద, శరీరంమీద అక్కడక్కడా కట్లతో, రక్తం పోయి తెల్లగా పాలిపోయిన మొహంతో ఓ పక్కకు ఒరిగి నిద్రపోతూ ఉంది వసంత.

అప్రయత్నంగానే అనుకున్నాడు— 'జీవించలేను. వసంత లేకపోతే జీవించలేను' అని.

గబగబా సర్జన్ దగ్గరికి పరుగెత్తాడు.

"సారీ, బ్రదర్! ఆవిడ బ్రతకాలంటే రక్తం కావాలి. కానీ ..." అంటూ ఖాళీ బ్లడ్ టాంక్‌ను చూపించాడు డాక్టర్.

"అయితే ... అయితే ..." పిచ్చిగా చూశాడు రాజా.

* * *

మంటలు ఆకాశాన్ని అంటుకున్నట్లున్న పెద్ద చితి. కళ్ళలో ఆనందం నింపుకొని అదోవిధంగా చూస్తున్నాడు రాజా. విశాలమైన కళ్ళని విప్పార్చుకొని చూస్తూ ఉంది వసంత ఆత్మ.

జబ్బుమీద చురుక్కున ఏదో దిగి నొప్పి కలిగేసరికి, "అమ్మా!" అంటూ బాధగా కళ్ళు తెరిచింది వసంత.

సిరంజ్ చేతిలోకి తీసుకుంటూ నవ్వుతూ నిలుచుని ఉన్నాడు డాక్టర్.

"ఆయన ... ఆయన రాలేదూ?" పిచ్చిగా అడిగింది వసంత.

నవ్వుతూ రాజావైపు చూపించి వెళ్ళిపోయాడు డాక్టర్.

భార్యకు రక్తదానం చేసి నీరసంగా నిలబడి ఉన్నాడు రాజా.

"వసంతా!"

"నేను... నేను చచ్చిపోతా ననుకున్నాను. కానీ ..." దిక్కుమొహం వేసుకుంది. కళ్ళలో నీళ్ళు తిరిగాయి వసంతకు.

"ఛ! ఇక ఆ మాట అనకు. ఇన్నాళ్ళ వరకు జరిగింది మరిచిపో. నేను నీ వాణ్ణే ఇక. నీలో ఉండేది నీ రక్తమేకాదు. నా రక్తం కూడా సగభాగం ప్రవహిస్తోంది. అసలు నీకు పునర్జన్మ నిచ్చింది నేనే. నా రక్తాన్ని నేనే మరగ కాచుకుంటావా?" ఆప్యాయంగా వసంత చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు రాజా.

నమ్మలేనట్లు చూసింది వసంత.

"నన్ను నమ్ము, వసంతా!"

"చాలు! ఆ ఒక్క మాట చాలు. మరింకేదీ మీ దగ్గరనుండి కోరను."

ఆరాధన నిండిన కళ్ళతో భర్తవైపు చూసింది వసంత.

"మీరు ఆవిణ్ణి ఎక్కువసేపు మాట్లాడించకండి. ఆవిడకు రెస్టు కావాలి... మీరు కూడా రెస్టు తీసుకుంటే మంచిది." వార్నింగ్ ఇచ్చి నవ్వుకుంటూ వెళ్ళిపోయింది నర్సు. ★